# ముదిరితే ముప్పు



ఆరోగ్యకరమైన జీవితం గడపదల్చుకున్నవారికి పరిశుభ్రత పట్ల శ్రద్ధ ఎక్కువగా ఉంటుంది. అప్పుడప్పుడు వ్యవహారం ముదిరిపోతుంది. ఏదైనాసరే ముదిరిపోతే ముప్పు తప్పదనేది అనుభవజ్ఞుల అభిప్రాయం. మా ఎదురింట్లో ఓ పశువుల డాక్టర్‌గారుంటున్నారు. ఆయన సాధారణంగా ఇంట్లోవుండడు. వృత్తిపట్ల శ్రద్ధ ఎక్కువ అని ఆయన సతీమణి అభిప్రాయం.

ఆయన సరే— ఆవిడకి మాత్రం శ్రద్ధ సహనం కాస్త ఎక్కువ పాళ్ళల్లోనేవున్నాయి. ఏక్షణంలో ఆవిడ ఇంట్లోకి మెరుపుదాడి చేసినా ఆవిడగారు చీర కుచ్చిళ్ళు బొడ్లో దోపుకుని, ఇల్లు తుడుస్తూనో, సోఫాలు సర్దుతూనో, అద్దాలు పాలిష్‌చేస్తూనో, బూజు దులుపుతూనో దర్శనం ఇస్తుంది. ఆవిడ ప్రారబ్ధానికి చిన్నసైజు రాక్షసుల్లాంటి ఇద్దరు పిల్లలున్నారు ఇంట్లో. కిట్టు, సరిత అని.

ఓసారి ఏదో సందర్భంలో డాక్టర్ పశుపతిగారు ఇంట్లోవున్న సుముహూర్తాన వారి ఇంటికి వెళ్ళవలసిన పరిస్థితి వచ్చింది. అప్పుడు కంటపడింది ఆయన శ్రీమతి కావేరిగారి కార్యకలాపం! టీవిని బట్టతో తెగతుడిచేస్తోంది! "కావేరీకి ఇంటిపట్ల శ్రద్ధ ఎక్కువ!" అన్నారు పశుపతి అభినందన పూర్వకంగా.

నిజంగా ఇల్లంతా అద్దంలావుంది. కార్పెట్ ప్రతినిత్యం శుభ్రంచేస్తున్నట్టు దాని అవతారం చూడగానే అర్థమైపోయింది. లోపలకెళ్ళి కాఫీ పట్టుకొచ్చి— నాచేతికి ఇచ్చిందావిడ. అప్పుడు చూడాలి ఆవిడ పరిస్థితి. నేను కాఫీ చప్పరిస్తుంటే కావేరిగారు నావైపు రెప్ప వాల్చకుండా చూస్తున్నారు. నేను ఆవిడ తదేకంగా చూస్తున్నది నన్నుకాదు. నా కప్పుని. కప్పుచివర నుంచి ఓ కాఫీచుక్క టక్కున రాలిపడింది కార్పెట్‌మీద. ఆవిడ మొహంలో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది.


"అయ్యయ్యో కాఫీ ఒలికిపోతోందండీ!" అందావిడ.

ఆదేక్షణంలో నన్ను ఆవిడ బారినుండి రక్షించడానికి అన్నట్లు కిట్టు, సరిత వచ్చారు స్కూలునుంచి.

ఆవిడ అరుపులు మొదలెట్టింది, బూట్లు వరండాలో విప్పిరాలేదని. వెధవ మురికి కాళ్ళతో కాళ్ళతో ఎందుకువచ్చారని, బుద్ధిలేదని, జ్ఞానం లేదని- తిట్టసాగింది. పశుపతిగారు ఏవో మాట్లాడుతున్నారు, గానీ నాకామాటలేం వినిపించి చావటంలేదు. చేతులుకాళ్ళు శుభ్రంగా కడుక్కోమని అరుస్తోందావిడ. నేను కాఫీతాగి ఖాళీచేసిన కప్పు ఇప్పుడు ఎక్కడుందో తెలుసా? డాక్టర్ పశుపతిగారి చేతిలో. క్రిందపెడితే భార్యామణికి కోపం వస్తుందట!

పరిశుభ్రత మంచిదే. కానీ ముదిరితే అదీ ఒకరకమైన 'ఫోబియా'గా మారిపోయే ప్రమాదం లేకపోలేదు. కనిపించని మారుమూలలన్నీ ప్రతిక్షణం— శుభ్రంచేస్తూకూర్చుంటే జీవితం అంతా 'మురికి నివారణోద్యమం' సాగిస్తూ, కూపస్థమండూకాల్లా మగ్గిపోవలసిందే!

—టి. రమణీప్రియ
హైదరాబాదు



# అత్తగారింట్లో

కొత్తగా పెళ్ళయి పుట్టినింటికి మొదటిసారి వచ్చిన కూతుర్ని అడిగింది తల్లి గోముగా "ఎలావున్నావే తల్లీ, మీవారు, మీ అత్తగారు నిన్ను బాగా చూసుకున్నారా?" అని.

"మావారు నన్ను ఎంతో ప్రేమగా ఆప్యాయంగా చూసుకుంటున్నారు గాని మా అత్తగారే నమ్మా. అస్తమానం చికాకు పడుతూవుంటారు. పని ఎంతబాగాచేసినా వంకలుపెట్టడం. మా వారిని నన్నూ ఏరాత్రో అయితేతప్ప ఒంటరిగా ఉండనివ్వదు. మాట్లాడనివ్వదు. ఏ సినిమాకో వెళ్ళాలన్నా యింట్లోవాళ్ళెవరేనా తయారవుతారు" అంది కూతురు కల్యాణి.

తల్లి మొహం ఒక్కసారిగా వాడిపోయింది. "ఎందుకు అలాచేస్తుంది ఆవిడ. తనకూ ఆడపిల్లలున్నారుకదా, కష్టం సుఖం తెలియదూ? ఈసారి నిన్ను దింపడానికొచ్చినప్పుడు గట్టిగా అడుగుతానుండు. నీవు నోట్లోనాలుక లేనిదానివని అలా చేస్తున్నట్టుంది" అంది తల్లి.

కల్యాణి నవ్వుతూ "అమ్మా నేను చెప్పింది నాగురించి కాదు. ఒదిన గురించి. నీవు ఒదినను ఎలాచూస్తున్నావో నేను పెళ్ళయి అత్తగారింటికెళ్ళాక అర్థమైంది. అన్నా ఒదిన సినిమాకెడుతుంటే ఎన్నోసార్లు నేను, నువ్వుకూడా వెళ్ళాం గుర్తుందా? కాని మా అత్తగారు వెడతానన్నా మాతో ఎవర్నీ పంపదు. నేను పనిచేస్తుంటే, తను కూడా వంటింట్లోనే వుండి నాలుగు కబుర్లు చెపుతూ, సాయంచేస్తుంది. కాని నీలా హాల్లో కూచుని రేడియో వినదు. నీవు ఒదిన పనిలో వంకలుపెట్టి తనపైన చిర్రుబుర్రులాడుతుండడం నాకు అప్పుడు తప్పుగా అనిపించలేదు. కాని ఇప్పుడు తెలిసింది. అమ్మా, నీ కూతుర్ని వాళ్ళ అత్తగారు ఎలా చూసుకోవాలనుకుంటావో అలాగే నీ కోడల్నికూడా చూడాలికదూ? ఇలా చెప్తున్నందుకు కోపగించుకోవు కదూ."

కల్యాణి తల్లి ఆలోచిస్తోంది. కల్యాణికి తృప్తిగా అనిపించింది. తల్లిని ఆలోచింపచేయగలిగానే అని. మనం చేస్తున్నదే సరి అనుకోనంతకాలం, ఎదుటివాళ్ళ దృష్టితోకూడా ఆలోచింపగలిగితే చాలా సమస్యలు తగ్గిపోతాయి.

భార్గవిరావ్